# దానికే మందు

భమిడిపాటి కామేశ్వరరావు గారు, బి. ఏ.

అప్పుడు నా కింకా పాతిక బోటాబోటే. మాబలగం అయిదారుగురం ఉండేవాళ్లం. కొందరు నలబైయోపడిలో పడ్డవాళ్లున్నా, ఒకొక్కడు ఓవంద కోతుల పెట్టు. ప్రతీవాడూ ఒక అచ్చాఛడీ, అనగా మరేం లేదు, రాళ్లు తిని హరాయించుగునే రకం. అచ్చయ్య ఒకడు. అచ్చయ్య పచ్చగా మిసమిసలాడుతూ తాడెత్తున ఉండేవాడు, ఎదేనా వచ్చిందంటే ఎదరవాడి కణత మీద టపాకాయిలాంటి లెంపకాయి పేల్చి మరీ మాట్లాడేవాడు. తరవాత, ఉండ్రంముక్కల్లాగ రామయ్య కామయ్య లుండేవారు. వాళ్లని శ్రావణ భాద్రపదాలని పిలవడంకూడా కద్దు. వాళ్లిద్దరూ చెరో వామనావతారం అవడంవల్ల,వాళ్లు ఇతరుల్ని కొట్టిన లెంపకాయలు ఎప్పటికప్పుడు దూసుగు పోతోచ్చినా, దెబ్బలాటల్లోమాత్రం కాళ్లసందుల్ని ఉడుముల్లాగ దూరిపోయేవారేమో, ఛస్తే అందేవారు కారు. ఆపైని జానికిరామయ్య ఒకడు. జానికిరామయ్యకి భజనంటే సరదా. నాకూను. అయితేం, కానికిరామయ్య చాలా గడసరి. మేం ఇద్దరం కాస్త పైహంగుకి ఉండేవాళ్లం. ఓబయ్య ఓడు. ఓబయ్య స్తబ్ధు, ప్రతీపన్లోనూ జొరబడి, దిగబడి, కూరుకుపోయి ప్రతీపనీ నిప్పక్కర్లేకుండానే తగలపెట్టేవాడు. అందుకని, మాలో ఎవడికి ఎందుకు ఎవడిమీద అక్కసు వచ్చినా సరే వాడెళ్లి అమాంతంగా ఓబయ్యని తనివితీరా తిట్టేవాడు. వాడవన్నీ మహరాజులా నవ్వుతూ పడేవాడు. మాజనం సంకల్పమాత్రంలో కలుసుగునేవారు. ఊళ్లో ఎవళ్లేనా తమరిదొడ్లో చెట్టున కాసిన దబ్బకాయలు లాంటివి ఊరగా యెట్టుగోడానికి సాయంత్రం పడకుండా ఉప్పూకారం వగైరా రైటుచేసుగుని, మొన్నాడు ఉదయానికప్పుడే ఊరగాయి కుండలో పడ్డట్టు ఊటలూరి రొట్టలేస్తూండేవా రనుకోండి! మావాళ్లు ఎల్లానో ఆవాసన తగిలి, పోగై, ఆరాత్రే చెట్టు సమూలంగా దులిపి, తెల్లవారేసరికి చెట్టుకాయలు సరేసరి ఆకులుకూడా ఊడ్చేసి మోడులాగ చేసి, “ఇహను ఈచెట్టు పట్టిగెళ్లి పోయిలో పెట్టుగోండి” అన్నట్టు అట్టే పెట్టేవాళ్లు. మొన్నాడు యజమాన్లు, ఆచారప్రకారం, కోసినవాళ్లని ఎల్లానూ దుమ్మెత్తిపోస్తూండేవారు గనక, ఆ సుముహూర్తానికి మేంకూడా వెళ్లి యజమాన్లకి మద్దతై, ఉమ్మడితిట్లు తిట్టేవాళ్లం.—(ఓబయ్యని మనస్సులో పెట్టుగుని—పాపాలకల్లా భైరవుడు!). అల్లాంటి పన్లు మావే అయుంటాయి అని జనం అనుకునే వారు గాని, సాక్ష్యం లేకపోడంవల్ల, ఎవరూ ఏమీ అనలేకపోయేవారు. పైచెప్పిన అర్జెంటుకేసుల్లోనేకాకుండా, ఇతరప్పుడు, అనగా, ఎవర్నైనా ఓ పాంపసికట్టడం అంటే, మరి ఎప్పుడేనా ఊరు అంటుగోడం అంటే, ఎదేనా ఓ బరువు కదిలించడం అంటే,. లాంటి ప్రమాదాలలోకూడా కలిసి, మేం జనానికి యథాశక్తి సాయితా అవుతూండడంవల్ల మమ్మల్ని జనం అసలు ఏమీ అనలేక పోయేవారు. ఇల్లాంటి గ్రామ సంబంధమైన స్వల్పాల్లోమాత్రమే కాక, వ్యాజ్యాలూ, సప్తాహాలూ, యాత్రలూ, తీర్థాలూ, లాంటి గ్రామాంతర దండయాత్రలుకూడా మేం కలిసే చేసేవాళ్లం.

ఓసారి, మమ్మల్ని ఓబయ్య, కురుపు సలిపినట్టు సలపగా, మేం క్షేమగిరియాత్ర బయలుదేరాం. వెళ్లేది యాత్రగదా అని చేప్పేసి, వీలునుబట్టి, ఎవడికి తోచింది వాడు మూటకట్టుకున్నాడు. నేను అప్పడాలు పుచ్చుగున్నాను, మరోడు అటుగులు పట్టుగున్నాడు, ఇంకోడు పెసరపప్పు తెచ్చాడు, సరి ఓబయ్య ఉప్పు కొనుక్కొచ్చాడు. కాని, మాఊరికి కొన్ని మైళ్లదూరంలోనే ఓ యేరు దాటాలి. అది దాటడంలో చిన్న అవాంతరం ఓటి తప్పిందికాదు. అసలే అది చిన్న డింగీ, ఆవకాయ పెచ్చులాగ. పైపెచ్చు, ఓబయ్య అందులో అడుగున పడుకుంటే తూకంగా ఉండునా, ఓవేపు అంచు మీద కూచున్నాడు, మహా. నట్టేట్లోకి వెళ్లేసరికి, అచ్చయ్య వతనప్రకారం ఉత్తపుణ్యానికి ఓబయ్యని తిట్టుగోడం మొదలెట్టాడు. ఎప్పుడూ లేంది ఓబయ్యకి

